సాక్షి అనంతపురం

సోమవారం । 4 । సెప్టెంబర్ । 2023



ఉత్తమ ఆచార్యులు వీరే

విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తున్న ఎస్కేయూ, జేఎన్‌టీయూ (ఏ) ప్రొఫెసర్లను పురస్కారాలకు ఎంపిక చేశారు. 8లో



టమాట కిలో రూ.13

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.13, కనిష్టం రూ.3, సరాసరి రూ.8.50 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.9°/23.2°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. గాలివేగం తగ్గింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడ వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

జేసీ ఇంటి ముందున్న 60 అడుగుల రోడ్డు సర్వే

- కోర్టు ఆదేశాలతో రంగంలోకి అధికారులు



రోడ్డును సర్వే చేస్తున్న అధికారులు

తాడిపత్రి అర్బన్: ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ నిర్మాణ పనులను సర్వే అనంతరం చేపట్టాలని హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. దీనికి అనుగుణంగానే ఆదివారం మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. సంజీవనగర్‌లోని ప్రధాన 60 అడుగుల రోడ్డును సర్వే చేశారు. జేసీ సోదరుల ఇంటి ముందు నుంచి వెళ్లే 2 కిలోమీటర్ల రహదారిని సర్వే చేపట్టారు. ఈ నేపథ్యంలో జేసీ అనుచరులు పెద్ద ఎత్తున జేసీ ఇంటి వద్దకు చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్‌ఐలు ధరణీబాబు, గౌస్‌మహ్మద్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గత నెల 20న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ నిర్మాణ పనులను నాడు–నేడు ఫేజ్ 2 కింద చేపట్టారు. అయితే మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, అతని అనుచరులు నిర్మాణ పనులను అడ్డుకున్నారు. కోర్టులోనూ అనుచరులతో పిటిషన్ వేయించారు. సర్వే చేసి సమగ్ర నివేదిక సమర్పించిన తరువాతే నిర్మాణ పనులు చేపట్టాలని హైకోర్టు 15 రోజుల పాటు స్టే విధించింది. దీంతో ఆదివారం అధికారులు రోడ్డు సర్వే చేశారు. ఆర్‌అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రసాద్‌రెడ్డి, డీఈ సురేష్‌నాయక్, జేఈ రామేశ్వర్‌రెడ్డి, శింగనమల జేఈ మూర్తి తదితరులు సర్వేలో పాల్గొన్నారు.

కొండ చిలువ కలకలం



కొండచిలువను చూపుతున్న దృశ్యం

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి పట్టణంలో కలెక్టరేట్‌కు ఆనుకుని ఉన్న సత్యసాయి మిరుపురి సంగీత కళాశాల వద్ద ఆదివారం భారీ కొండ చిలువ కలకలం రేపింది. ఆవరణలో పెరిగిన గడ్డిని తొలగిస్తున్న సమయంలో కూలీలకు కొండచిలువ కనిపించింది. భయాందోళనకు గురైన వారు వెంటనే స్నేక్ క్యాచర్ మూర్తికి సమాచారం అందించారు. ఆయన చాకచక్యంగా దాన్ని పట్టుకుని సమీపంలోని అడవులోకి వదిలారు.

హెచ్చెల్సీకి మళ్లీ గండి



కాలువకు గండి పడటంతో బయటకు వెళ్తున్న నీరు

బొమ్మనహాళ్: జిల్లాకు తాగు, సాగు నీరు అందించే హెచ్ఎల్‌సీ కాలువకు మళ్లీ గండి పడింది. వారం క్రితం బళ్లారి ప్రాంతంలో గండి పడిన కాలువకు ఎదురుగానే కొలగల్లు సమీపంలో 78–600 కిలోమీటర్ వద్ద ఆదివారం సాయంత్రం గండి పడింది. తొలుత కాలువలో నీరు లీకేజీ అవుతూ నీరు బయటికి వచ్చాయి. అనంతరం పైపింగ్ కాస్త గండిగా మారింది. విషయం తెలుసుకున్న తుంగభద్ర బోర్డు ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డి, జేఈఈలకు సమాచారం చేరవేయడంతో అధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మరమ్మతు చర్యలు చేపట్టారు. జేసీబీతో గండి పడిన ప్రాంతాన్ని మట్టితో నింపి పైపింగ్‌ను బంద్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. సోమవారం ఉదయం నాటికి కాలువలో నీటిమట్టం పూర్తిగా తగ్గిస్తామని, నీరు పూర్తిగా తగ్గాకా పనులు వేగవంతం చేస్తామని ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డి చెప్పారు. వారం వ్యవధిలోనే హెచ్చెల్సీకి మరోసారి గండి పడటం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

అభివృద్ధికి అడ్డుపుల్ల జేసీ!



'కుక్కతోక వంకర ' అన్న చందంగా ఉంది తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి వ్యవహారం. గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పినా ఆయన బుద్ధిలో మాత్రం ఏ మార్పూ రాలేదు. మున్సిపల్ ఎన్నికల్లో ఓట్ల కోసం సేవ్ తాడిపత్రి పేరుతో మొసలి కన్నీరు కార్చి బోటాబోటీగా గెల్చి మున్సిపల్ చైర్మన్ పీఠమెక్కారు. చైర్మన్ స్థానంలో తాడిపత్రిని అన్ని విధాలా అభివృద్ధి చేయాల్సిన జేసీ.. అందుకు భిన్నంగా అభివృద్ధి పనులకు మోకాలడ్డుతున్నారు.

- తాడిపత్రి పట్టణాభివృద్ధికి అడుగడుగునా ఆటంకాలు
- జేసీ ప్రభాకర్‌రెడ్డి ఒంటెద్దు పోకడలపై సర్వత్రా విమర్శలు
- చైర్మన్ స్థానంలో ఉండి పనులు అడ్డుకోవడం సరికాదంటున్న జనం



జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచరులు కూల్చివేసి మట్టి కప్పివేసిన జూనియర్ కళాశాల ప్రహరీ పనుల ప్రదేశం ఇదే.. (ఇన్‌సెట్) వర్షపు నీళ్లతో చెరువును తలపిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం (ఫైల్)

తాడిపత్రి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు వివిధ పనులకు శ్రీకారం చుట్టారు. అయితే అభివృద్ధి పనులు పూర్తయితే ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి ఎక్కడ మంచి పేరు వస్తుందో అన్న అక్కసుతో జేసీ ప్రభాకర్‌రెడ్డి అభివృద్ధి పనులన్నింటినీ తన పచ్చ మూకలను అడ్డుపెట్టుకుని అడ్డుకుంటున్నాడు.

సొంత పార్టీ నేతల అసంతృప్తి..

జేసీ ఒంటెద్దు పోకడలు నచ్చక సొంత పార్టీలోని కొందరు నాయకులు ఇప్పటికే టీడీపీని వీడారు. మరికొందరు వీడేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు తనకు ఎమ్మెల్యే టికెట్ వస్తుందో? రాదోనన్న ఆందోళనతో తీవ్ర నిరాశ, నిస్పృహలో ఉన్న జేసీ ప్రభాకర్‌రెడ్డి క్షుద్ర రాజకీయాలతో పట్టణాభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నారన్న విమర్శలున్నాయి.

రాత్రికి రాత్రే నిర్మాణాల కూల్చివేత..

తాడిపత్రి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని జేసీ టీం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకుందన్న ఆరోపణలున్నాయి. అయితే నాడు – నేడు ఫేజ్ 2 పనుల్లో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు. జూనియర్ కళాశాల సమీపంలో జేసీ ప్రభాకర్‌రెడ్డి నివాసం ఉండడంతో ప్రహరీ వల్ల తన వారికి ఎక్కడ ఇబ్బందులు కలుగుతాయోనని గత నెల 19న రాత్రి ప్రభుత్వ వ్యయంతో అప్పటి వరకూ చేపట్టిన ప్రహరీ పనులను కూల్చివేశారు. తన పచ్చబ్యాచ్‌తో రాత్రికి రాత్రే కాంక్రీట్ పిల్లర్లను కూల్చివేసి, గుంతలను పూడ్చివేశారు. మరుసటి రోజు కూలీలు పని చేపట్టేందుకు ప్రదేశానికి వెళ్లగా మేస్త్రీ, కూలీలను పనులు చేపట్టకూడదని హుకుం జారీ చేశారు. మేస్త్రీ గురుశంకర్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బందోబస్తు మధ్య తిరిగి కళాశాల ప్రహరీ నిర్మాణ పనులు సాగేలా చూశారు. దీన్ని జీర్ణించుకోలేని జేసీ ప్రభాకర్‌రెడ్డి తన అనుచరుడి చేత కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చి మరీ కళాశాల ప్రహరీ నిర్మాణ పనులు ముందుకు సాగకుండా అడ్డుపుల్లేశారు.

మరికొన్ని ఇలా....

- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు తాడిపత్రి పట్టణం, ఆంజనేయస్వామి మాన్యంలోని పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. పేద ప్రజలకు మేలు జరగడాన్ని జీర్ణించుకోలేని జేసీ ప్రభాకర్‌రెడ్డి తన అనుచరులచే హైకోర్టులో కేసులు వేయించి ఇళ్ల పట్టాల పంపిణీకి అడ్డుపడ్డారు.
- పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లోని మున్సిపల్ స్థలంలో ఆరోగ్య ఉపకేంద్ర భవనం నిర్మించడం గిట్టక తన అనుచరుడు, ఓ టీడీపీ కౌన్సిలర్‌తో హైకోర్టులో పిటీషన్ వేయించి ఆ పనులకూ ఆటంకం కలిగించారు.
- తాడిపత్రిలో పెరిగిపోతున్న ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పోలీసు ఉన్నతాధికారులతో చర్చించి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ మంజూరుకు ఒప్పించారు. అప్పటి ఎస్పీ కూడా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అయితే ఎమ్మెల్యే సొంత డబ్బుతో స్టేషన్ నిర్మాణం చేపట్టడాన్ని ఓర్వలేక మళ్లీ ఓ టీడీపీ కౌన్సిలర్‌తో హైకోర్టులో పిటీషన్ వేయించారు. నిర్మాణ పనులు ముందుకు సాగకుండా స్టే తెప్పించారు. దీంతో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులు ఆగిపోయాయి.
- ఆటోనగర్ సమీపంలో జగనన్న ఇళ్ల నిర్మాణాల కోసం అర్హులైన పేద ప్రజలకు ఇళ్ల స్థలాలను కేటాయిస్తే వాటిని కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతే కాదు గతంలో అక్రమంగా ఇళ్ల స్థలాలు పొంది, రద్దయిన పట్టాలను తిరిగి ఇవ్వాలంటూ వారిచే కోర్టులో కేసు వేయించి అడ్డుకునే ప్రయత్నం చేశారు.

జేసీ తీరుపై సర్వత్రా విమర్శలు..

ఎమ్మెల్యే పెద్దారెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్మన్‌గా జేసీ ప్రభాకర్‌రెడ్డి సహకరించాల్సింది పోయి అడుగడుగునా అడ్డుకోవడం సమంజసం కాదని పట్టణ ప్రజలు అంటున్నారు.

ప్రశాంతత చెడగొట్టేందుకే...

ఎమ్మెల్యేగా కేతిరెడ్డి పెద్దారెడ్డి గెలుపొందిన అనంతరం తాడిపత్రి నియోజకవర్గంలో శాంతి భద్రతలకు పెద్దపీట వేశారు. పోలీసులకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చి, శాంతిభద్రతలను వారు అదుపులో ఉంచేలా కృషి చేశారు. అయితే మూడున్నర దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితానికి చెక్ పడడంతో మింగుడు పడని జేసీ ప్రభాకర్‌రెడ్డి ఎలాగైనా తిరిగి పట్టు సాధించేలా నియోజకవర్గంలో అలజడులు సృష్టించేందుకు కుట్రపన్నుతూ నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారన్న విమర్శలున్నాయి.

చంద్రబాబు నిప్పు కాదు తుప్పు

- ఐటీ నోటీసులపై చంద్రబాబు నోరు విప్పాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

తాడిపత్రి అర్బన్: టీడీపీ అధినేత చంద్రబాబు నిప్పు కాదు.. ఓ తుప్పు అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ఎద్దేవా చేశారు. ఆదివారం స్థానిక గన్నెవారిపల్లి కాలనీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పైలా మాట్లాడారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎల్‌అండ్‌టీ, షాపూర్‌జీ పల్లంజీ సంస్థలకు పనులను అప్పగించి వాటి నుంచి కమీషన్ల పేరుతో షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబుకు రూ.118.98 కోట్లు ముట్టినట్లు ఆధారాలు లభ్యమయ్యాయన్నారు. చంద్రబాబు మనీ ల్యాండరింగ్‌కు పాల్పడి ఫెమా చట్టాన్ని ఉల్లంఘించారని, ఐటీ నోటీసులపై నోరు విప్పాలని డిమాండ్ చేశారు. ఇందులో వాస్తవం లేకపోతే చంద్రబాబు అండ్ కో ఘాటుగా స్పందించేవారని, వారు మౌనం పాటిస్తున్నారంటే తప్పుజరిగిందని అందరికీ అర్థమవుతోందని చెప్పారు. కమీషన్ల కోసం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును ఏటీఎంగా మార్చుకున్నారని అప్పట్లో ప్రధాని మోదీ కూడా చెప్పారని గుర్తు చేశారు. టిడ్కో ఇళ్ల నిర్మాణానికి చదరపు అడుగుకు రూ.2,200 చొప్పున ఇచ్చారని నిజానికి చదరపు అడుగుకు రూ.1200 మించదన్నారు. అమరావతి పేరుతో చంద్రబాబు పాల్పడిన అవినీతికి అంతేలేదన్నారు. కేవలం రాజధాని నిర్మాణాల ప్లానింగ్‌కే కన్సల్టింగ్ కంపెనీలకు భారీగా ప్రజా సొత్తును సమర్పించిన అవినీతి చక్రవర్తి చంద్రబాబని నిప్పులు చెరిగారు. ఐటీ శాఖ నోటీసులు, కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థల విచారణకు హాజరుకావాల్సిన చంద్రబాబులో రోజు రోజుకు భయం పెరుగుతోందని, అందువల్లే ఢిల్లీలో బీజేపీ పెద్దల కాళ్లు పట్టుకునేందుకు తహతహలాడుతున్నారన్నారు. కమీషన్ల వ్యవహారంపై ఈడీ, సీబీఐ అధికారులు జోక్యం చేసుకుని సమగ్ర దర్యాప్తుకు ఆదేశించి ఈ కేసును తమ పరిధిలోకి తీసుకోవాలని పైలా డిమాండ్ చేశారు.

షేక్ ఖాజాను గెలిపించాలి

- డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న డెప్యూటీ సీఎం అంజాద్‌బాషా (చిత్రంలో) ఎమ్మెల్యేలు అనంత, వైవీఆర్

రాప్తాడురూరల్: వక్ఫ్ బోర్డు ముతవల్లి సభ్యుని ఎన్నికకు సంబంధించి ఈనెల 9వ తేదీ జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపస్తున్న అభ్యర్థి షేక్ ఖాజాను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా పిలుపునిచ్చారు. ఆదివారం అనంతపురం నగరంలోని ఓ హోటల్‌లో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ అధ్యక్షతన జరిగిన జిల్లా వక్ఫ్ నోటిఫైడ్ ముతవల్లీల సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా డిప్యూటీ సీఎంతో పాటు అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీలు మహమ్మద్ రుహుల్లా, ఇషాక్‌బాషా, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ , మేయర్ వసీం, అనంతపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ ఫయాజ్ , తాడిపత్రి సీనియర్ నాయకులు ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు ముతవల్లి సభ్యుని ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా 243 ముతవల్లీలు ఓటు వినియోగించుకోవాల్సి ఉందన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 43 ఓట్లు ఉన్నాయన్నారు. అందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. రాష్ట్రంలో వక్ఫ్ బోర్డు ప్రక్షాళన మొదలైందన్నారు. అన్యాక్రాంతమైన 680 ఎకరాల వక్ఫ్ ఆస్తులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత స్వాధీనం చేసుకున్నామన్నారు. వక్ఫ్ బోర్డు ముతవల్లి సభ్యుని ఎన్నికల్లో బరిలో ఉన్న షేక్ ఖాజాకు గత పాలక వర్గంలో డైరెక్టర్‌గా పనిచేసిన అనుభవం ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నోటిఫైడ్ ముతవల్లీలందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 42 మంది ముతవల్లీలతో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, మైనార్టీ నాయకులు వేముల నదీమ్, మైనారిటీ కార్పొరేట్ డైరెక్టర్ గౌస్‌బేగ్, నాయకులు సైపుల్లాబేగ్, సత్యసాయి జిల్లా నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత స్థానానికి చేరాలి..

అనంతపురం కల్చరల్: ఉన్నతంగా చదువుకుంటేనే మంచి భవిత ఉంటుందని డిప్యూటీ సీఎం అంజాద్ బాషా అన్నారు. జిల్లా పర్యటనలో ఉన్న ఆయన ఆదివారం సాయంత్రం రుద్రంపేటలోని దారులుమ్ అరబిక్ మదరసాను సందర్శించారు. అక్కడి చిన్నారుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గతంతో పోలిస్తే అరబిక్ చదుతున్న వారికి మంచి అవకాశాలొస్తున్నాయని, శ్రద్ధగా చదువుకొన్ని ఉన్నత స్థానాలు చేరుకోవాలన్నారు. అంజాద్ బాషా వెంట ఎమ్మెల్సీలు ఇషాక్ బాషా, రుహుల్లా, వైఎస్సార్‌సీపీ స్టేట్ మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీ షేక్ ఖాజా, జిల్లా మార్కెట్‌యార్డు చైర్మన్ ఏకే ఫయాజ్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ రిజ్వాన్, మౌలానా నిస్సార్‌సాబ్, మదరసా నిర్వాహకులు హనీఫ్, ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మీడియా సెంటర్ వార్షికోత్సవం



సాంస్కృతిక ప్రదర్శన..

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయం కేంద్రంగా సత్యసాయి ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేస్తున్న సత్యసాయి మీడియా సెంటర్ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేశవిదేశాలకు చెందిన మీడియా సెంటర్ సిబ్బంది, వలంటీర్లు హాజరయ్యారు. దేశీయంగా వివిధ ప్రాంతాలకు చెందిన సంస్కృతీసంప్రదాయాలను ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సత్యసాయి మీడియా సెంటర్ సేవలను వివరిస్తూ ఆ సంస్థ ప్రతినిధులు ప్రసంగించారు. పిదప సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

సెలవులో డీఎంహెచ్‌ఓ



అనంతపురం క్రైం : జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి భ్రమరాంబదేవి వారం రోజుల పాటు క్యాజువల్ లీవ్‌లో వెళ్లారు. ఇటీవల పదోన్నతిలో భాగంగా ఆమె తిరుపతి రుయా నుంచి అనంతపురం డీఎంహెచ్‌ఓగా నియమితులైన విషయం విధితమే. డీఎంహెచ్‌ఓ వచ్చే వరకు ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ సుజాత ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓగా వ్యవహరించనున్నారు.

'మదిరేభైలు' శోకసంద్రం

- కదిరి సమీపంలో ఆటోను కారు ఢీకొనడంతో నలుగురి మృతి
- మృతులంతా మదిరేభైలు, రెడ్డితండాకు చెందిన వారే
- సమాచారంతో పెద్ద ఎత్తున గ్రామానికి చేరుకున్న బంధువులు



ఘటనాస్థలం వద్ద మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు




చిన్న స్వామినాయక్ (ఫైల్), చలపతినాయక్ (ఫైల్)




శ్రీలేఖ (ఫైల్) మృతుడు భాస్కర్‌నాయక్

పుట్టపర్తి: కదిరి సమీపంలోని యర్రదొడ్డి క్వార్టర్స్ వద్ద ఆదివారం ఆటోను కారు ఢీకొన్న ఘటనలో బుక్కపట్నం మండలం మదిరేభైలు, మదిరేభైలుతండా, రెడ్డివారిపల్లి తండా గ్రామాలకు చెందిన నలుగురు దుర్మరణం పాలయ్యారు. ఘోర ప్రమాదంలో తమ గ్రామానికి చెందిన వారు మృతి చెందారన్న విషయం తెలుసుకున్న గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఘటన గురించి తెలిసిన వెంటనే బంధువులు పెద్ద ఎత్తున ఆయా గ్రామాలకు తరలి వచ్చారు. మృతదేహాల వద్ద గుండెలవిసేలా రోదించారు. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతులతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుని పలువురు గ్రామస్తులు కన్నీరు పెట్టుకున్నారు. తమతో ఎంతో ఆనందంగా మాట్లాడి, వెళ్లొస్తామంటూ బయలుదేరారని, అంతలోనే ఇలాంటి విషాద వార్త వినాల్సి వస్తుందనుకోలేదంటూ పలువురు కన్నీటి పర్యంతమయ్యారు.

అందరూ పేద, మధ్య తరగతికి చెందిన వారే..

ప్రమాదంలో మృతి చెందిన వారంతా పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే కావడం గమనార్హం. ఘటనలో మదిరేభైలు తండా సర్పంచ్ విజయకుమారి బాయి భర్త చిన్నస్వామి నాయక్ (35) ప్రాణాలు కోల్పోయారు. విజయ కుమారి బాయి, చిన్నస్వామి నాయక్ దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. ట్రాక్టర్ బాడుగకు నడుపుకుంటూ దంపతులు జీవనం సాగిస్తుండేవారు. ఉన్నంతలో సంతోషంగా జీవనం సాగిస్తున్నారు. అనుకోని ప్రమాదంలో కుటుంబపెద్ద చిన్నస్వామి నాయక్ మృతి చెందడంతో కుటుంబం దిక్కులేనిదిగా మారింది. భర్త మరణ వార్త తెలుసుకున్న విజయకుమారి బాయి గుండెలవిసేలా రోదించారు. చిన్నస్వామి నాయక్ మృతదేహం వద్ద ఆమె రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

- ఇక మృతుల్లో ఒకరైన చలపతినాయక్ (37)కు భార్య నారాయణి బాయి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్థానికంగా కరెంట్ మెకానిక్ పనులు చేస్తూ చలపతి నాయక్ కుటుంబాన్ని పోషించేవాడు. గ్రామస్తులతో ఎంతో కలివిడిగా ఉండేవారు. అలాంటి వ్యక్తి అకస్మాత్తుగా ప్రాణాలు కోల్పోయాడని తెలుసుకున్న పలువురు ఆయనతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుని విలపించారు.
- రెడ్డివారిపల్లి తండాకు చెందిన భాస్కర్‌నాయక్ (48) కూడా ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఈయనకు భార్య పతిబాయి, కుమారుడు ఉన్నారు. గ్రామంలో స్టోర్ డీలర్‌గా పనిచేస్తూనే, భార్యతో కలిసి కూలి పనులు చేసుకుంటూనే.. ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుండేవారు. ఈ క్రమంలోనే భాస్కర్ నాయక్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు.

తల్లి ప్రేమకు దూరమైన పిల్లలు..



మృతురాలు శ్రీలేఖ కుమార్తెలు సుజిత, దీక్షిత

ప్రమాదంలో మదిరేభైలుకి చెందిన గోపాల్ రెడ్డి భార్య శ్రీలేఖ (35) కూడా ప్రాణాలు కోల్పోయింది. కదిరిలోని పాఠశాలల్లో చదువుతున్న తమ పిల్లలు సుజిత, దీక్షితను చూసేందుకు వెళ్తున్న సమయంలో ఈ ఘటన జరగడం గమనార్హం. దీంతో పిల్లలిద్దరూ తల్లి ప్రేమకు దూరమయ్యారు. తల్లి మృతదేహం వద్ద పిల్లలు రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి దిగ్భ్రాంతి

ప్రమాద ఘటనపై ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే ఆదేశాలతో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, పార్టీ ముఖ్య నేతలు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుల కుటుంబీకులను ఓదార్చారు. కాగా, సోమవారం జరగనున్న మృతుల అంత్యక్రియలకు ఎమ్మెల్యే హాజరు కానున్నట్లు పార్టీ నేతలు తెలిపారు.

పుట్లూరులో భారీ వర్షం

- 17 మండలాల పరిధిలో 14.5 మి.మీ సగటు నమోదు



పుట్లూరు మండలం ఎస్.తిమ్మాపురం గ్రామం చుట్టూ చేరిన వర్షపు నీరు

అనంతపురం అగ్రికల్చర్: ఈ సీజన్‌లో మొదటిసారిగా పుట్లూరు మండలంలో 111.6 మి.మీ భారీ వర్షం కురిసింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు 17 మండలాల పరిధిలో 14.5 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. ఆత్మకూరు 71.6 మి.మీ, యల్లనూరు 63.2, తాడిపత్రి 55.4 మి.మీ మేర భారీ వర్షం పడింది. అలాగే యాడికి 38.2 మి.మీ, పెద్దపప్పూరు 24.6 మి.మీ, నార్పల 24.6 మి.మీ, శింగనమల 19.2 మి.మీ, బుక్కరాయసముద్రం 12.2 మి.మీ, రాప్తాడు 10.4 మి.మీ తో పాటు గుత్తి, పెద్దవడుగూరు, గార్లదిన్నె, పామిడి, గుంతకల్లు, అనంతపురం, కూడేరు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది.

ఆదివారం సాయంత్రం నుంచి...

ఆదివారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకూ పలు మండలాల్లో మంచి వర్షాలు కురిశాయి. కళ్యాణదుర్గం, రాప్తాడులో 50 మి.మీ, కంబదూరు, అనంతపురం 38 మి.మీ, బెళుగుప్ప, ఆత్మకూరు 25 మి.మీ, పామిడి, గార్లదిన్నె, పెద్దపప్పూరు 20 మి.మీ నమోదు కాగా మిగతా ప్రాంతల్లో మోస్తారు నుంచి తేలికపాటి వర్షం నమోదైంది.

క్లుప్తంగా

నేడు సూపర్ స్పెషాలిటీలో సీసీబీ నిర్మాణానికి భూమిపూజ

అనంతపురం క్రైం: జిల్లా కేంద్రంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేయనున్న క్రిటికల్ కేర్ బ్లాక్ (సీసీబీ) నిర్మాణానికి సోమవారం ఉదయం 9 గంటలకు భూమిపూజ చేయనున్నారు. ఈ మేరకు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ కింద రూ.23.75 కోట్ల నిధులతో నిర్మాణ పనులు చేపట్టనున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ తలారి రంగయ్య, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, అధికారులు హాజరుకానున్నారు.

డీఈఓకు ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి పరామర్శ



డీఈఓ సాయిరాం ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

రాప్తాడురూరల్: అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం ఇంటి వద్ద కోలుకుంటున్న జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్‌ను ఆదివారం ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయనతో మాట్లాడుతూ.. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుంటారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ వెంట పీఆర్టీయూ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి ఉన్నారు.

పాముకాటుతో యువరైతు మృతి



మృతుడు కమలాకర్‌రెడ్డి

రాయదుర్గం రూరల్: పాము కాటుతో ఓ యువ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... రాయదుర్గం మండలం బొమ్మక్కపల్లికి చెందిన పాటిల్ నారాయణరెడ్డి, చింతామణి దంపతుల కుమారుడు కమలాకర్‌రెడ్డి (34) వ్యవసాయ పనులతో కుటుంబానికి చేదోడుగా ఉంటున్నాడు. తాను సాగు చేసిన మొక్కజొన్న పంటలో ఆదివారం కంకి కోత పనులు చేపట్టారు. కూలీలతో పాటు కంకి కోస్తున్న కమలాకర్‌రెడ్డి కాలుపై పాము కాటు వేసింది. విషయం తెలుసుకున్న కూలీలు, కుటుంబసభ్యులు వెంటనే ఆటోలో రాయదుర్గంలోని సీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే కమలాకర్‌రెడ్డి మృతిచెందినట్లు నిర్ధారించారు. పెళ్లి సంబంధాలు చూస్తున్న సమయంలో ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఉత్తమ ఆచార్యులు వీరే

- ఎస్కేయూలో ప్రొఫెసర్లు కె.రాంగోపాల్, ఏవీ రమణ
- జేఎన్‌టీయూ(ఏ)లో ప్రొఫెసర్లు పద్మ సువర్ణ, వీబీ చిత్ర

అనంతపురం: విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తున్న ప్రొఫెసర్లకు ఏటా ఉత్తమ ఆచార్యుల పురస్కారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. ఈ నెల 5న గురుపూజోత్సవం సందర్భంగా పురస్కారాల ప్రదానానికి అర్హులైన వారి ఎంపిక ప్రక్రియ పూర్తయింది. ఎస్కేయూ పరిధిలో ఇద్దరు, జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో ఇద్దరేసి ప్రొఫెసర్లను పురస్కారాలకు ఎంపిక చేశారు. ఎంపికైన వారి వివరాలు...

ఇస్రో పరిశోధనల్లో దిట్ట



ఇస్రో (ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్) నేతృత్వంలోని ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రాన్ని ఎస్కేయూలోని ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్‌గా ప్రొఫెసర్ కె.రాంగోపాల్ వ్యవహరిస్తున్నారు. వాతావరణంలో దుమ్ము, ధూళి, ఆర్ధ్రత, వర్షపాతం, కాలుష్యం తదితర అంశాలపై ఎప్పటికప్పుడు ఇస్రోకు సమాచారం చేరవేసేలా నిరంతరం శ్రమిస్తున్నారు. సీడీసీ డీన్‌గా, పాలిమర్ సైన్సెస్ విభాగాధిపతిగా, పీఆర్వోగా అదనపు బాధ్యతలూ నిర్వర్తిస్తున్నారు. ఇప్పటి వరకూ 172 పరిశోధన పత్రాలను అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో ప్రచురించారు. ఆయన పర్యవేక్షణలో 17 పీహెచ్‌డీలు, ఆరు ఎంఫిల్ డిగ్రీలు ప్రదానమయ్యాయి. అంతర్జాతీయ స్థాయిలో 70కి పైగా సెమినార్లకు హాజరయ్యారు. 10 జాతీయ స్థాయి సెమినార్లను, 6 డీఎస్టీ ఇన్‌స్పైర్ క్యాంపులను నిర్వహించారు. వాతావరణ శాస్త్రానికి సంబంధించిన 8 అంతర్జాతీయ ప్రచురణలను వెలువరించారు. జాతీయ పరిశోధన సహకారం కోసం స్పేస్ ఫిజిక్స్ ల్యాబొరేటరీ (తిరువనంతపురం), ఫిజిక్స్ రీసెర్చ్ ల్యాబొరేటరీ (అహమ్మదాబాద్) పరిశోధనా సంస్థలతో కలిసి పనిచేస్తున్నారు.

సమర్థతకు పట్టం



ఎస్కేయూలో మూడు దశాబ్దాలకు పైగా సోషయాలజీలో బోధనానుభవం కలిగిన ప్రొఫెసర్ జీవీ రమణ... సివిల్ సర్వీసెస్, గ్రూప్–1 పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఎన్నో నైపుణ్యాలను వివరిస్తున్నారు. ఈయన పర్యవేక్షణలో 12 మందికి పీహెచ్‌డీ అవార్డులు ప్రదానమయ్యాయి. గ్రామీణాభివృద్ధికి సంబంధించి 22 పుస్తకాలను ప్రచురించారు. రెండు పుస్తకాలకు ఎడిటర్‌గా పనిచేశారు. ఇంటర్మీడియట్ స్థాయిలో సమాజశాస్త్రం, ఓపెన్ స్కూల్ సమాజశాస్త్రం పాఠ్యాంశాల రచనలో పాలుపంచుకున్నారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో 75 పరిశోధనపత్రాలను, నాలుగు పుస్తకాలు వెలువరించారు. కవి, రచయిత, వ్యాఖ్యాత, వ్యక్తిత్వ వికాస నిపుణుడు, నటుడు, బోధకుడు, పరిశోధకుడుగా ఆయన రాణించారు. ప్రస్తుతం ఎస్కేయూ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

అప్లైడ్ ఫిజిక్స్‌లో నిష్ణాతులు



జేఎన్‌టీయూ(ఏ) ఇంజినీరింగ్ కళాశాలలో ఫిజిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఆర్.పద్మసువర్ణ... అప్లైడ్ ఫిజిక్స్‌లో నిష్ణాతులుగా ఖ్యాతి గడించారు. ఫిజిక్స్ విభాగాధిపతిగా పనిచేశారు. 2013–17 మధ్య కాలంలో సింథసిస్ అండ్ క్యారక్టరైజేషన్ ఆఫ్ నానో స్ట్రక్చర్డ్ కండక్టింగ్ పాలిమర్స్ ఫర్ ద ఫ్యాబ్రికేషన్ ఆఫ్ లిథియం బ్యాటరీస్' అనే ప్రాజెక్టును రూ.9.67 లక్షల వ్యయంతో నిర్వహించారు. ఇరాడియేషన్ ఆఫ్ స్టడీస్ ఆన్ పాలిమర్ జెల్స్ ఫర్ సోలార్ సెల్స్ అనే ఐయూఏసీ స్పాన్సర్డ్ బీమ్ టైం ప్రాజెక్ట్‌లోనూ పనిచేశారు. మొత్తం ఏడు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నారు. అలాగే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 16 జర్నల్స్ ప్రచురించారు. ఏడు వర్క్‌షాప్‌లు నిర్వహించారు.

అపార అనుభవం



జేఎన్‌టీయూ (ఏ)ఇంజినీరింగ్ కళాశాలలో ఇంగ్లిష్ ప్రొఫెసర్ వీబీ చిత్రకు ఇంగ్లిష్‌పై అపారమైన పట్టు ఉంది. ఇంగ్లిష్‌లో అనేక పుస్తకాలు రచించారు. మొత్తం 17 అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నారు. 10 వర్క్‌షాప్‌లు నిర్వహించారు. బ్రిటీష్ కౌన్సిల్ తరఫున మూడు ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లు చేపట్టారు. తొమ్మిది ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సదస్సులు నిర్వహించి అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు. 9 సెమినార్లు నిర్వహించి విద్యార్థులు ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించేలా విశేష కృషి చేస్తున్నారు.

వినూత్న బోధనకు సరైన గుర్తింపు

- ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులకు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులు
- రేపు విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా అందుకోనున్న అధ్యాపకులు డాక్టర్ కె.సుధాకర్, విష్ణుప్రియ



రాప్తాడురూరల్: వినూత్న బోధనకు సరైన గుర్తింపు దక్కింది. రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డులకు అనంతపురం ఆర్ట్స్ కళాశాల నుంచి ఇద్దరు ఎంపికయ్యారు. ఈ నెల 5న విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా వీరు అవార్డులు అందుకోనున్నారు.

బోధన... పరిశోధన



బోధనలో 12 ఏళ్ల అనుభవమున్న డాక్టర్ కరణం సుధాకర్ అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో చరిత్ర అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. నిత్యం విద్యార్థులను ఉత్తేజపరుస్తూ వారిని పోటీ పరీక్షల వైపు ప్రోత్సహిస్తూ వస్తున్నారు. పురావస్తు శాస్త్ర ప్రాముఖ్యత, చారిత్రక కట్టడాల పరిరక్షణ ఆవశ్యకతపై విద్యార్థులను చైతన్య పరచడంలో ఆయన ప్రత్యేక శైలిని కనబరుస్తుంటారు. బోధనకే పరిమితం కాకుండా పరిశోధన రంగంలోనూ ఎంతో ప్రగతి సాధించారు. ఆయన పరిశోధనలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రచురించబడ్డాయి. పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లోనూ పాల్గొన్నారు. 40కు పైగా పరిశోధనపత్రాలు సమర్పించారు. రెండు జాతీయ సదస్సులు నిర్వహించారు. బోధన, పరిశోధనలకే పరిమితం కాకుండా కళాశాల, వర్సిటీ అడకమిక్ అంశాల్లోనూ చురుగ్గా పాల్గొన్నారు.

బోధనలో మేటి



క్రమశిక్షణ, కఠోర విద్యాభ్యాసం ఎం.విష్ణుప్రియను ఆర్ట్స్ కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకురాలిగా ఎదిగేలా చేసింది. తన 24వ ఏటనే డిగ్రీ కళాశాల అధ్యాపకురాలిగా ఉద్యోగం సాధించిన ఆమె ఎమ్మెస్సీలో ఆంధ్ర యూనివర్సిటీలో మొదటి ర్యాంకు సాధించారు. వృక్షశాస్త్ర విభాగంలో తనదైన శైలిలో బోధన కొనసాగిస్తూ విద్యార్థుల్లో నైపుణ్యాల వృద్ధికి బాటలు వేస్తున్నారు. తరగతి గదిలో సెమినార్, ప్రాజెక్ట్ పద్ధతుల్లో విద్యాబోధన సాగించడంలో ఆమె నిష్ణాతురాలు. వివిధ రకాల ఔషధ మొక్కల వివరాలు సేకరిస్తూ విద్యార్థులను చైతన్య పరుస్తూ అందులో పీహెచ్‌డీ పొందేందుకు సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఎన్ఎస్ఎస్ ఆఫీసరుగా సేవలందిస్తూ విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువలనూ బోధిస్తున్నారు. తనవంతు సేవల్లో భాగంగా ఏటా ఓ నిరుపేద విద్యార్థి చదువులకయ్యే మొత్తం ఖర్చును ఆమెనే భరిస్తున్నారు.

మూఢ నమ్మకాలు వీడితేనే సమాజాభివృద్ధి

- జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు డాక్టర్ గేయానంద్



మాట్లాడుతున్న డాక్టర్ గేయానంద్

కళ్యాణదుర్గం రూరల్: మూఢ నమ్మకాలు వీడినప్పుడే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు డాక్టర్ గేయానంద్ అన్నారు. కళ్యాణదుర్గంలోని డిగ్రీ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక 17వ జిల్లా మహాసభలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ.. సైన్స్‌తోనే మానవ మనుగడ ముడిపడి ఉందన్నారు. అంధ విశ్వాసాలతో దేశాభివృద్ధి కుంటుపడుతోందన్నారు. పిల్లలకు శాస్త్రీయ విద్య బోధించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం కళ్యాణదుర్గం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యుడిగా కంబాల తిమ్మారెడ్డిని ప్రకటించారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు డాక్టర్ ప్రసూన, డాక్టర్ రంగన్న, లక్ష్మీనారాయణ, వీరన్న, జగదీష్ భాస్కర్, రామిరెడ్డి, అయూబ్, వెంకట మాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి



భూమిపూజలో పాల్గొన్న ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు: దశాబ్దాలుగా అణచివేతకు గురైన వాల్మీకుల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎంపీ తలారి రంగయ్య, గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి అన్నారు. దాదాపు రూ.45లక్షల ఎంపీ, ఎమ్మెల్యే నిధులతో ఆదివారం పాత గుంతకల్లులో చేపట్టిన వాల్మీకి కల్యాణమంటపం నిర్మాణానికి వారు భూమిపూజ చేసి మాట్లాడారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టిన తర్వాతనే రాష్ట్రంలో వాల్మీకుల అభ్యున్నతికి బాటలు పడ్డాయన్నారు. వాల్మీకులకు ఏ కష్టమొచ్చినా అండంగా ఉంటామని, వారి ఎదుగుదలకు తమ వంతు కృషి చేస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భవానీ, ఎంపీపీ బి.మాధవీ, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్వీ ఆర్ మోహన్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్.రామలింగప్ప, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఎస్.గాదిలింగేశ్వరబాబు, కౌన్సిలర్లు యనుమల భాస్కర్, రవి, కేవీ నాగరత్న, ఉడుదల ప్రభాకర్, మాజీ కౌన్సిలర్ బి.సుంకప్ప, వాల్మీకి సంఘం పట్టణ గౌరవ అధ్యక్షుడు ఉడుదల పెద్దన్న, నాయకులు మస్తాన్, చాముండి, యల్లప్ప, దౌల్తాపురం ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

పెద్దవడుగూరు: మండలంలోని చింతలచెరువు నివాసి జిలాన్ బాషా (20) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. గ్రామ శివారులోని రైతు లక్ష్మీనారాయణ పొలంలో మొక్కజొన్న కంకి కోసేందుకు ఆదివారం ఉదయం తన సోదరుడు బాబా ఫక్రుద్దీన్‌తో కలసి వెళ్లిన జిలాన్.. ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కంటి ముందే సోదరుడు మృత్యువాత పడడంతో అన్న బాబా విలపించిన తీరు చూపరులకు కంటతడి పెట్టించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి



మృతుడు రాము

కూడేరు: విద్యుత్ షాక్‌కు గురై కూడేరు మండలం కడదరకుంటకు చెందిన రాము(35) మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు.. ముద్దలాపురంలో బంధువుల ఇంట సీమంతం కార్యక్రమానికి హాజరైన రాము భోజనం ముగించుకుని ఇంటి ఎదుట సేదతీరాడు. అదే సమయంలో రేకుల షెడ్‌కు విద్యుత్ సరఫరా అవుతున్న విషయం తెలియక చిన్నారులు ఆడుకుంటూ పైపును పట్టుకున్నారు. విద్యుత్ షాక్‌కు గురికాగానే పిల్లలు గట్టిగా కేకలు వేయడంతో అక్కడకు సమీపంలోనే ఉన్న రాము.. వెంటనే పిల్లలను కాపాడాడు. ఆ సమయంలోనే అనుకోకుండా పైపును తాకడంతో విద్యుత్ షాక్‌కు గురై కుప్పకూలాడు. కుటుంబసభ్యులు వెంటనే కూడేరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యుడి సూచన మేరకు అనంతపురంలోని ఆస్పత్రికి తరలించేందుకు సిద్ధమయ్యారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడకు చేరుకుని అప్పటికే రాము మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య చౌడమ్మ, ఓ కుమారుడు ఉన్నారు.


రాష్ట్ర స్థాయి బాలికల ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం



తలపడుతున్న క్రీడాకారులు

అనంతపురం: ఏపీ, అనంతపురం జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో సబ్ జూనియర్ బాలికల రాష్ట్ర స్థాయి పోటీలు ఆదివారం అనంత క్రీడాగ్రామంలో ప్రారంభమయ్యాయి. మొత్తం 13 జట్లు పాల్గొన్నట్లు అనంతపురం జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి మల్లేష్ తెలిపారు. తొలిరోజు వివిధ జట్ల మధ్య మ్యాచ్‌లో హోరాహోరీగా సాగాయి. ఫైనల్ మ్యాచ్‌ను సోమవారం నిర్వహించనున్నారు. కాగా, ఇప్పటి వరకూ ప్రతిభ కనబరిచిన పి.దాదాఖలందర్, అంజలి, సుధాకర్ (తిరుపతి), కరీముల్లా (గుంటూరు), బుజ్జి (విజయవాడ) జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు.

విధుల్లోకి 'సత్యసాయి తాగునీటి' కార్మికులు



చర్చలు ఫలించడంతో హర్షం వ్యక్తం చేస్తున్న కార్మికులు

అనంతపురం రూరల్/కూడేరు: సత్యసాయి, శ్రీరామరెడ్డి తాగునీటి పథకాల్లో పనిచేస్తున్న కార్మికులు సమ్మె విరమించి విధుల్లోకి చేరుతున్నట్లు ప్రకటించారు. తమ డిమాండ్ల సాధనకు గత కొన్ని రోజులుగా కార్మికులు సమ్మెలోకి వెళ్లిన విషయం విదితమే. ఈ క్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా సత్యసాయి కార్మిక సంఘం తరఫున సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్‌తో ఆదివారం ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ హఫ్సస్‌బాషా, ప్రాజెక్ట్ డీఈ రామారావు చర్చలు జరిపారు. బకాయి వేతనాల అంశాన్ని ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి ప్రజాప్రతినిధులు, అధికారులు తీసుకెళ్లడంతో రెండు రోజుల క్రితం రూ.30 కోట్ల నిధులు మంజూరైనట్లు వివరించారు. పెండింగ్‌లో ఉన్న 18 నెలల ఈఎస్ఐ, 8 నెలల పీఎఫ్ చెల్లించడంతో పాటు అక్టోబర్ నుంచి రూ. 500 వేతనం పెంపు, రూ.1,100 బోనస్ పెంపు చేస్తామని అధికారులు హామీనిచ్చారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనంలో రెండు నెలల మొత్తాన్ని తక్షణమే కార్మికుల బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేస్తున్నట్లు ప్రకటించారు. మిగిలిన వేతనాన్ని ఈ నెల 20వ తేదీ లోపు చెల్లిస్తామని భరోసానిచ్చారు. అధికారుల భరోసాపై కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ సమ్మె విరమించారు.

క్లుప్తంగా

ఆకట్టుకున్న బాలగోకులం



నిర్వాహకులతో కృష్ణ వేషధారులు

అనంతపురం కల్చరల్: పాతూరులోని ప్రాచీన దత్తాత్రేయ ఆలయంలో ఆదివారం బాల గోకుల కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఆలయ మేనేజర్ అప్పా సుధీర్, సంస్కార భారతి జిల్లా కార్యదర్శి లక్ష్మి ఆధ్వర్యంలో చిన్నారులు శ్రీకృష్ణ, గోపికల వేషధారణలతో సందడి చేశారు. నాట్యాచార్యులు పట్నం శివప్రసాద్, విశ్వనాథ్, సీనియర్ న్యాయవాది హరికృష్ణ, సాయిట్రస్టు విజయ్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.

కృష్ణాష్టమి వేడుకలకు ఇస్కాన్ సిద్ధం



పూజలందుకునే రాధాకృష్ణులు

అనంతపురం కల్చరల్: జిల్లాలోనే వైభవంగా సాగే శ్రీకృష్ణాష్టమి వేడుకలకు ఇస్కాన్ మందిరం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. ఆదివారం మందిరంలో జరిగిన సమావేశంలో ఇస్కాన్ చైర్మన్ దామోదర గౌరవంగదాసు వివరాలు అందించారు. ఈనెల 6 నుంచి మూడు రోజుల పాటు వేడుకలు వైభవంగా సాగుతాయని, బుధవారం విశ్వశాంతి యజ్ఞం, హరినామ సంకీర్తనతో ప్రారంభమై సాయంత్రం చిన్నారుల కృష్ణ వేషధారణలు, సాంస్కృతిక సంబరాలు, గురువారం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా రాధా పార్థసారథులకు పుష్పాభిషేకం, శృంగారహారతి, సుదర్శన హోమం సాయంత్రం తెప్పోత్సవం, ఊంజల సేవ ఉంటాయన్నారు. చివరిరోజు మహాపుష్పాభిషేకం, ఇస్కాన్ వ్యవస్థాపకులు శ్రీల ప్రభుపాదుల దివ్య చరితాగానం అనంతరం నగరవీధుల్లో శ్రీకృష్ణ రథయాత్ర జరుగుతుందన్నారు.

సంతల ఆదాయం రూ.3.03 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.3.03 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.1,42,400 వసూలయ్యింది. ఆదివారం జరిగిన పశువుల సంత నుంచి రూ.1,61,200 మేర వసూలైనట్లు చైర్మన్, సెక్రటరీ తెలిపారు.

లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎంపిక



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

అనంతపురం కల్చరల్: లయన్స్‌క్లబ్ అనంతపురం మెయిన్ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు సంస్థ చైర్మన్ నబీరసూల్ ఆదివారం తెలిపారు. అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, సెక్రటరీగా అసీఫుద్దీన్, కోశాధికారిగా కరణం ఉమామహేశ్వరి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. అంతకు ముందు స్థానిక గిల్డ్ ఆఫ్ సర్వీసు పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి కంటి పరీక్షలకు 210 మంది హాజరయ్యారు. వారిలో 130 మంది శస్త్రచికిత్సలకు ఎంపికయ్యారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు సన్మానం



అంగన్‌వాడీ కార్యకర్త తాయారును సన్మానిస్తున్న ఐసీడీఎస్ ఉద్యోగులు

అనంతపురం సెంట్రల్: నగరంలోని లక్ష్మీనగర్ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త తాయరు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం సన్మానించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కొండమ్మ, విజయకుమారి, హేమలత, కోఆర్డినేటర్ హరిణి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి జమున, మాజీ అధ్యక్షురాలు లలితమ్మ తదితరులు ఆమెను సన్మానించారు. అంగన్‌వాడీ కార్యకర్తగా తాయారు అందించిన సేవలను వారు కొనియాడారు. బాధ్యతాయుతంగా పనిచేసి లబ్ధిదారులు, అధికారుల నుంచి మంచి పేరు తెచ్చుకున్నట్లు తెలిపారు. శేషజీవితం కూడా ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నగరంలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎందుకో నిర్లక్ష్యం!

- జేఎన్‌టీయూ క్యాంపస్‌లో క్యాంటీన్ నిర్వహణపై నిర్లిప్తత
- అవగాహన సదస్సులు లేని వైనం



అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేయాల్సిన క్యాంటీన్ ఏడాదికిపైగా గడుస్తున్నా నేటికీ తెరవలేదు. రాయలసీమ రీజియన్ నుంచి అధికంగా విద్యార్థులు ఇక్కడ అడ్మిషన్లు తీసుకుంటున్నారు. 77 ఏళ్ల ఘన చరిత్ర ఉన్న ఇంజినీరింగ్ కళాశాలలో అడ్మిషన్ తీసుకోవడానికి విద్యార్థులు పోటీ పడుతున్నారు. అన్ని రకాల సదుపాయాలు ఉంటాయని విద్యార్థులు భావిస్తారు. కనీసం కళాశాల క్యాంటీన్‌ను సైతం అధికారులు అందుబాటులోకి తీసుకరాలేని పరిస్థితి ఏర్పడింది. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల క్యాంటీన్ నిర్వహణకు ఆరు నెలల కిందట టెండర్లు ఆహ్వానించారు. మూడేళ్ల కాలపరిమితికిగాను రూ.11 లక్షలకు ఒకరు, మరొకరు రూ.9 లక్షలు, మూడో వ్యక్తి రూ. 7 లక్షలకు కోట్ చేశారు. అయితే ముగ్గురికీ అనుభవ సర్టిఫికెట్ లేదన్న కారణంతో ఎవరికీ కేటాయించలేదు. దీంతో అధిక మొత్తంలో టెండర్ దక్కినా కేటాయించలేదనే కారణంతో కోర్టులో కేసు దాఖలయ్యింది. దీంతో టెండర్ల ప్రక్రియ ఆగిపోయింది. అప్పటి నుంచి క్యాంటీన్ లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పలేదు. డే స్కాలర్లు బయటి హోటళ్లకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

న్యాక్ గ్రేడింగ్‌పై ప్రభావం:

జేఎన్‌టీయూ అనంతపురం న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) గ్రేడింగ్‌కు దరఖాస్తు చేశారు. క్యాంపస్‌లోని వసతులపై పాయింట్లు కేటాయిస్తారు. విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన క్యాంటీన్ నిర్వహించకపోతే పాయింట్లు తగ్గే అవకాశం ఉంది. తద్వారా న్యాక్ గ్రేడింగ్‌పై ప్రభావం చూపనుంది. కోర్టులో అడ్డంకి తొలగే వరకు ప్రత్యామ్నాయంగా వర్సిటీ అధికారుల ఆధ్వర్యంలోనే క్యాంటీన్ నిర్వహించాలని విద్యార్థులు కోరుతున్నారు. హాస్టల్ మేనేజర్ పర్యవేక్షణలోనే స్టూడెంట్ మేనేజ్‌మెంట్ హాస్టల్‌ను అందుబాటులోకి తీసుకరావాలని విద్యార్థులు విన్నవిస్తున్నారు. హాస్టల్స్‌ను విద్యార్థులే స్వతహాగా నిర్వహించనున్న రీతిలోనే క్యాంటీన్‌ను నిర్వహిస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

వర్సిటీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

నూతనంగా ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించాం. క్యాంటీన్ లేదనే అంశంపై విద్యార్థులు, అధ్యాపకులు ఇది వరకే మా దృష్టికి తెచ్చారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసే అంశంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. స్టూడెంట్స్ మేనేజ్‌మెంట్ హాస్టల్స్ అంశాన్ని విద్యార్థులు ప్రతిపాదన చేశారు.

– ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, ప్రిన్సిపాల్, జేఎన్‌టీయూ అనంతపురం

ఉప ముఖ్యమంత్రిని కలిసిన నాయకులు



డిప్యూటీ సీఎంను కలిసిన ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, ఆలూరు సాంబశివారెడ్డి, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, నదీం అహ్మద్ తదితరులు

అనంతపురం టవర్‌క్లాక్: నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషాను ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్‌లు, వక్ఫ్‌బోర్డు చైర్మన్ రిజ్వాన్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించారు. కార్పొరేటర్లు బాబాఫక్రుద్దీన్, సాకే చంద్ర, అనిల్ కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్, రవి, రఫి, షెక్షావలి, షాషావలి కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బాబా ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమ పోస్టర్లను డిప్యూటీ సీఎం ఆవిష్కరించారు. అనంతరం డిప్యూటీ సీఎం సూరజ్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన వక్ఫ్‌బోర్డ్ కార్యక్రమానికి వెళ్లారు.

నేషనల్ లెవెల్ క్యారమ్ పోటీలకు విద్యార్థులు



పోటీలకు ఎంపికైన సరస్వతీ విద్యామందిరం విద్యార్థులు

పామిడి: స్థానిక సరస్వతీ ఉన్నత విద్యామందిరం విద్యార్థులు నేషనల్ లెవెల్ క్యారమ్ పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థుల ఎంపిక పట్ల ఆదివారం సరస్వతీ ఉన్నత విద్యామందిరం హెచ్‌ఎం శ్రీనివాసన్, ఆచార్య బృందం హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన 3 రాష్ట్రాల క్షేత్రస్థాయి విద్యాభారతి పాఠశాలల క్యారమ్ పోటీల్లో స్థానిక సరస్వతీ ఉన్నత విద్యామందిరం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభతో ప్రథమస్థానం సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు.

నేడు వైస్ ఎంపీపీ -2 ఎన్నిక

చెన్నేకొత్తపల్లి: మండల పరిషత్ ప్రాదేశిక ఉపాధ్యక్షుడు – 2 వైస్ ఎంపీపీ ఎన్నిక సోమవారం నిర్వహిస్తున్నట్లు ప్రొసీడింగ్ అధికారి గోపాలరెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరగనున్న సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలన్నారు.

చెర్లోపల్లిలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: మండలంలోని చెర్లోపల్లిలో వ్యక్తి విషద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వీరాంజనేయులు కొన్ని నెలలుగా కుటుంబ సమస్యలతో మద్యానానికి బానిసయ్యాడు. శనివారం అర్ధరాత్రి మద్యం పూటుగా సేవించి విషద్రావకం తాగాడు. కుటుంబసభ్యులు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుత్తి: పట్టణంలోని కమాటం వీధికి చెందిన ఖలందర్ కుటుంబ కలహాలతో తీవ్ర మనస్థాపానికి గురై ఆదివారం విషద్రావకం తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నేడు స్పందన

కనగానపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తహసీల్దార్ రమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులంతా హాజరై, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించాలన్నారు.

మల్లేశ్వరస్వామి ఆలయంలో ఎలుగుబంటి

కంబదూరు: మల్లేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి ఓ ఎలుగు బంటి సంచరించింది. ఆలయ ప్రాంగణంలోని సీసీ కెమెరాల్లో ఎలుగు బంటి సంచరించిన సంఘటన నిక్షిప్తమైంది. ఆదివారం ఉదయం పూజారులు సీసీ కెమెరాలను పరిశీలించగా ఎలుగు బంటి సంచరించిన విషయం బయట పడింది.ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. భక్తులు రాత్రి పూట ఆలయానికి వెళ్లడానికి జంకుతున్నారు. ఆలయ సమీపంలో ముళ్ల పొదలు, చెరువు, కొండ ఉండడంతో తరచూ ఎలుగుబంట్లు సంచరిస్తున్నట్లు స్థానికులు వాపోయారు. అటవీ శాఖ అధికారులు ఎలుగు బంట్ల సంచారాన్ని అరికట్టాలని భక్తులు, స్థానికులు కోరారు.

తుమ్మపూడి సేవలు చిరస్మరణీయం

- ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి



తుమ్మపూడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కవులు, రచయితలు

అనంతపురం కల్చరల్: సౌజన్యశీలిగా ఆచార్య తుమ్మపూడి అనంత సాహిత్యానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఆచార్య చంద్రశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోమ్‌లో సాహితీ దిగ్గజం తుమ్మపూడి కోటేశ్వరరావు సంస్మరణ సభను ఆయన శిష్యబృందం నిర్వహించారు. తుమ్మపూడి వద్ద పరిశోధన చేసిన ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ గ్రామిక దృక్పథం కలిగిన వ్యక్తిగా తుమ్మపూడి ఎందరికో ఆదర్శప్రాయమన్నారు. ఆయన రచనలు భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేవన్నారు. తిరుపతికి చెందిన శిష్యుడు ఆచార్య భక్తవత్సలరెడ్డి, జనప్రియకవి ఏలూరు యంగన్న, డాక్టర్ నిర్మలారాణి తదితరులు మాట్లాడుతూ గొప్ప మానవతావాదిగా తుమ్మపూడిని అభివర్ణించారు. ఆయన లేని లోటు ఎవరూ తీర్చలేనిదన్నారు. నిర్వాహకులు నాగేంద్ర, ఆచార్య రెడ్డప్పరెడ్డి, డాక్టర్ వెంకటరామిరెడ్డి, డాక్టర్ అంకే రామలింగమయ్య, రియాజుద్దీన్, అశ్వర్థరెడ్డి, కేంద్రసాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, సురేష్, మహాబోధి కృష్ణమూర్తి, చెట్ల ఈరన్న, తుమ్మపూడి కుమారుడు పళిని తదితరులు తుమ్మపూడితో అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

కేంద్రం తీరుతో నిరుద్యోగులకు అన్యాయం



మాట్లాడుతున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

గుంతకల్లు: కేంద్రంలోని మోదీ ప్రభుత్వ మొండి వైఖరితో నిరుద్యోగులకు తీవ్రంగా నష్టపోయారని డీవైఎఫ్‌ఐ నాయకులు ఆరోపించారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిరుద్యోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా డీవైఎఫ్‌ఐ (భారత ప్రజాతంత్ర యువజన సమైక్య) ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. డీవైఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యుడు సురేంద్ర, పట్టణ కార్యదర్శి దాసరి చరణ్‌కుమార్ మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో బీజేపీ నాయకులు ఏటా 2 కోట్ల ఉద్యోగులను భర్తీ చేస్తామని హామీ ఇచ్చి గద్దెనెక్కిన విషయాన్ని గుర్తు చేశారు. దాదాపు 8 ఏళ్లు గడిచిన లక్షల్లో కూడా ఉద్యోగులు ఇవ్వలేదని విమర్శించారు. లక్షలాది మంది నిరుద్యోగులు ఉన్నత చదువులు చదవి ఉద్యోగాలు లేక రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఖాళీగా ఉన్న అన్ని శాఖల్లోని ఉద్యోగులను భర్తీ చేసి నిరుద్యోగులకు బాసటగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ నాయకులు కసాపురం రమేష్, సునీల్‌కుమార్, సుధాకర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

‘మోదీ ప్రభుత్వం పేదల నడ్డి విరుస్తోంది’



బహిరంగ సభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శ రామకృష్ణ

గుంతకల్లు: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలతో పేదల నడ్డి విరుస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆరోపించారు. సీపీఐ చేపట్టిన బస్సు యాత్ర ఆదివారం రాత్రి కర్నూలు జిల్లా నుంచి గుంతకల్లులోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా స్థానిక పొట్టి శ్రీరాములు సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మతాల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయం చేస్తోందని విమర్శించారు. ఇప్పటికే రాజ్యాంగాన్ని భ్రష్టు పట్టించిన బీజేపీ ప్రభుత్వం మరోసారి గద్దెనెక్కితే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చేస్తుందని ఆరోపించారు. ఇండియా కూటమితో మోదీకి ముచ్చెమటలు పట్టాయన్నారు. ఈనెల ఏడో తేదీన బస్సు యాత్ర తిరుపతి చేరుతుందని సీపీఐ జాతీయ కార్యదర్శి రాజా బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్ జిల్లా కార్యవర్గ సభ్యులు గోవిందు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామచంద్రయ్య, రామాంజనేయులు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జాన్సన్ బాబు, నియోజవర్గ కార్యదర్శి వీరభద్ర స్వామి పాల్గొన్నారు.

మార్మోగిన సుబ్రహ్మణ్యేశ్వరుడి నామస్మరణ

- భక్తులతో కిటకిటలాడిన ఆలయం
- పూజల్లో పాల్గొన్న తోపుదుర్తి నయనతారెడ్డి




ఉత్సవ విగ్రహంతో ప్రదక్షిణలు చేస్తున్న తోపుదుర్తి నయనతారెడ్డి



ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేలాది మంది భక్తులతో ఆలయ ప్రాంగణం సుబ్రహ్మణ్యేశ్వరుడి నామస్మరణతో మార్మోగింది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామికి పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శ్రీ మంజునాథ స్వామికి అన్నాభిషేకం నిర్వహించారు. అనంతరం బంగారు కవచం ధరింపజేసి, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. ఆలయంలో కాల సర్పదోషాలు, దోష నివారణలకు రాహుకేతు హోమాలు నిర్వహించారు. భక్తులు జమ్మి చెట్టుకు పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పంపనూరు ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ఎస్కే యూనివర్సిటీ బోర్డు మెంబర్ తోపుదుర్తి నయనతారెడ్డి పూజలు చేశారు. అనంతరం అన్నాభిషేకం నిర్వహించారు.



అన్నాభిషేకంలో మంజునాథుడు



అలంకరణలో సర్పరూపుడు


సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మూలవిరాట్

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకులు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి, 108 శివలింగాలను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

బాట మారెమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మారెమ్మ దేవత

కనగానపల్లి: మండల కేంద్రం కనగానపల్లి సమీపంలోని బాట మారెమ్మ స్వామి ఆలయంలో శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని పూలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి, భక్తులు పూజలు చేసి, కానుకలు సమర్పించారు.

రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయండి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



నడిమివంక వద్ద రోడ్డు విస్తరణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: నగరంలోని నడిమివంక వద్ద జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదేశించారు. ఆదివారం ఎమ్మెల్యే నడిమివంక వద్ద జరుగుతున్న పనులు, టవర్‌క్లాక్ వద్ద జరుగుతున్న అంతర్గత రోడ్డు పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. తద్వారా నగర ప్రజలకు మరింత ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. ఎమ్మెల్యే వెంట జేసీఎస్ కన్వీనర్ చింతకుంట మధు, తదితరులు ఉన్నారు.

నేడు రైతులకు విత్తనాల పంపిణీ

రాప్తాడు: సేంద్రియ పద్ధతిలో ప్రకృతి వ్యవసాయం చేసే షెడ్యూల్ కులాల రైతులకు ఉచితంగా విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు ఆదివారం ఎంపీడీఓ సాల్మన్ ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో షెడ్యూల్ కులాల రైతులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వేరుశనగ, పెసలు, కందులు, రాగులు, కొర్రలు, సజ్జలు, శనగలు, మొక్కజొన్న, విత్తన జొన్నలు పంపిణీ చేస్తున్నామన్నారు.

నేడు ‘స్పందన’

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలోని నూతన భవనంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు స్పందన కార్యక్రమం జరగనుంది. నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ సావిత్రి, వివిధ విభాగాల అధికారులు హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారు.

చిరుతలు సంచరిస్తున్నాయని బెంబేలు



పి.యాలేరు నుంచి వై.కొత్తపల్లి పొలాల మధ్య చిరుతలు తిరిగిన జాడలు

ఆత్మకూరు: ఆత్మకూరు మండలంలోని పి.యాలేరు, సింగంపల్లి, వై.కొత్తపల్లి గ్రామాల మధ్య ఉన్న అటవీ ప్రాంతాల్లో చిరుత పులులు రెండు సంచరిస్తున్నాయని రైతులు, ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఆదివారం పి.యాలేరు గ్రామానికి చెందిన అతిక్‌రెడ్డి అనే రైతు పొలం వద్దకు మధ్యాహ్నభోజనం తీసుకెళ్లే సమయంలో చిరుత పులల అడుగుజాడలు కనిపించాయి. తన పొలం మీదుగా పొరుగున ఉన్న అనప తోట నుంచి ఇతర పొలాల్లోకి వెళ్లినట్లు అడుగుజాడలు ఉన్నాయని రైతు తెలిపాడు. ఇటీవల కూడేరు మండలం తిమ్మాపురం వద్ద చిరుత పులులు కనిపించినట్లు ప్రచారం జరుగుతోంది. రైతులు పొలాల వద్దకు వెళ్లాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో పొలాల వద్దకు వెళ్లడం లేదని రైతులు తెలిపారు.

ఆస్పత్రికొచ్చి పింఛన్ అందజేత



ఆస్పత్రిలో పింఛన్ అందిస్తున్న వెల్ఫేర్ కార్యదర్శి

అనంతపురం క్రైం: వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత పింఛన్‌దారులు ఇబ్బందులు పడకుండా సకాలంలో పింఛన్ పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నారు. బుక్కపట్నం ప్రాంతానికి చెందిన వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ భూషణ్‌కుమార్ ఇద్దరు వృద్ధులకు పింఛన్ అందించారు. బుక్కపట్నం మండలం గూనిపల్లికి చెందిన నారాయణాచారి, రామలక్ష్మమ్మ దంపతులు అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరికి వెల్ఫేర్ కార్యదర్శి భూషణ్‌కుమార్ ఆదివారం పింఛన్ అందించారు.